ఉపోద్ఘాతం

సరఃప్రభృతిదివ్యసూర్యుదితదివ్యసూక్ష్మాశయ -
ప్రకాశనసముద్భవానితరాలభ్యకీర్త్యుజ్జ్వలమ్ ।
గురుం హృది విభావయన్ వరముని ర్హి కృష్ణాహ్వయం
మదీయహృదయే సదా సకరుణం విధత్తాం స్థితిమ్ ॥
(ప్రతివాది భయంకరమ్ అణ్ణన్- వరవరమునిశతకమ్ -72)

నమ్మాళ్వార్ వైభవసంగ్రహం

వృషభే తు విశాఖాయాం కురుకాపురికారిజమ్ ।
పాండ్యదేశే కలే రాదా శఠారిం సైన్యపం భజే ॥

(కలియుగాదిలో వైశాఖమాసంలోని విశాఖానక్షత్రంలో పాండ్యదేశంలో ఉండే కురుకాపురి (తిరుక్కురుకూర్)లో **"కారియార్ల"**కు కుమారులై, సేనాధిపతుల (విష్వక్సేనుల) అంశతో అవతరించిన శఠకోపులను భజిస్తున్నాను) అని,

లాభే కలే ర్వాసర ఏవ తారే మాసే విశాఖే మహనీయతారే ।
శుక్రస్య వారే ఽజని విశ్వతిథ్యాం పరాంకుశో ఽయం భగవాన్ కుళీరే ॥

(కలియుగారంభం అయిన తరువాత **"లాభ"** అనే పదంచేత నిర్దేశింపబడే- (అంటే - లకారంచేత 3, భకారం చేత 4, **'అంకానాం వామతో గతిః'** అనే న్యాయాను సారం ఈ అంకెల క్రమాన్ని మాటిస్తే) 43 అనే అంకెను కల సంవత్సరంలో - అంటే కలియుగం ఆరంభమైన నాటినుండి 43వ సంవత్సరంలో, వసంతర్తువులో, వైశాఖ మాసంలో- విశాఖ అనే గొప్ప నక్షత్రంలో, శుక్రవారంనాడు, విశ్వతిథిలో - అంటే చతుర్దశీతిథిలో (విశ్వశబ్దం లోకాల సంఖ్యను- అంటే 14ను లక్షిస్తుంది) కర్కటకలగ్నంలో పరాంకుశభగవానులు అవతరించారు) అని,

శ్రీవిజ్ఞానదినోత్తరే ఽహని కలౌ వర్షే ప్రమాద్యాహ్వయే
మాసే మాధవనామ్ని భార్గవదినే ఋక్షే విశాఖాభిధే ।
లగ్నే శుద్ధచతుర్దశీతిథియుతే శ్రీమత్కుళీరే ఽపి చ
క్షిత్యాం ప్రాదురభూత్ పరాంకుశమునిః భాగ్యోదయా న్మాదృశామ్ ॥

(కలియుగంలో ప్రమాథి అనబడే సంవత్సరంలో, వైశాఖమాసంలో శుక్రవారం నాడు విశాఖానక్షత్రంలో శుక్లపక్షచతుర్దశీతిథితో కూడిన కర్కటక లగ్నంలో **"శ్రీవిజ్ఞాన"**

అనే అక్షరాలచేత లక్షింపబడే 42దినాలు గడచిన తరువాత 43వ దినాన మనవంటివారి పుణ్యంయొక్క ఫలంగా పరాంకుశముని అవతరించారు) (**"శ్రీవిజ్ఞాన"** అనే పదంలోని అక్షరాలు వరుసగా శ, ర, వ, జ, ఞ, న -అనేవి. ఇవి వరుసగా **5,2, 4, 87, 0, 0,** అనే అంకెలను **"కాదిదశ, తాదిదశ"** ఇత్యాదిక్రమంలో నిర్దేశిస్తాయి. వీటిని రెండు రెండుగా గ్రహించి గుణిస్తే- 5 x 2 =10, 4 x 8 =32, 0 x 0=0 అనే అంకెలు వస్తాయి. వీటిని కూడితే 10+32= 42 అనే అంకె సిద్ధిస్తుంది.)

రాధే కలిదినే లాభే వైశాఖే కావ్యవాసరే ।
లగ్నే కర్కటకేఽ సూత తనయం నాథనాయికా ॥ (దివ్యసూరిచరితమ్)

(**"లాభ"** అనే అక్షరాలచేత నిర్దేశింపబడే 43 వ అంకెను కల కలిదినంలో - అంటే- కలియుగాదిగా 43 వ దినంలో వసంతఋతువులో, వైశాఖమాసంలో, శుక్రవారంనాడు, కటక లగ్నంలో ఉడైయనఙ్జై కుమారుని ప్రసవించింది) అని-

ఈవిధంగా గల పలు పూర్వాచార్యుల సూక్తులవల్ల నమ్మాళ్వార్లు కలియుగ ప్రారంభమైన నాటినుండి 43వ దినంలో, ప్రమాథి అనే పేరుగల సంవత్సరంలో, వైశాఖమాసం శుక్లపక్షం చతుర్దశితిథిలో, విశాఖానక్షత్రంతో కూడిన శుక్రవారంనాడు కర్కటక లగ్నంలో అవతరించారు. వీరి తల్లి ఉడైయనఙ్జై. తండ్రి పేరు కారియార్లు.

ఆళ్వార్లు అందఱిలో నమ్మాళ్వార్లు అవయవి- అంగి- అని, మిగిలిన ఆళ్వార్లు వీరికి అవయవభూతులని చెప్పబడుతున్నది. **"తామ్రపర్ణీనదీ యత్ర కృతమాలా పయఃస్వినీ"** ఇత్యాదిగా శ్రీభాగవతంలో (11-5-39) వీరి వైభవం తెలుపబడింది. **"ఎన్నై తన్నై తన్నై తన్నైక్కుమ్ మున్నై"** (తిరువాయ్ 3-3-2), **"కేశవన్ తమర్ కీళ్ మేల్ ఎమర్ ఏళ్ళేళు పిఱప్పుమ్"** (తిరువాయ్-2-7-1) అని ఈ ఆళ్వార్లు స్వయంగా పల్కిన రీతిలో, **"ఏళ్ పడికాల్ తొడఙ్గి వన్ద వళి వళి యాట్చెయ్‌కిన్ఱోమ్"** అన్నట్లు ఏడేడు తరాలుగా శ్రీవైష్ణవసంబంధ పారంపర్యాన్ని కల శుద్ధమైన వంశంలో అవతరించిన మహనీయులు వీరు. పాండ్యదేశంలోని తామ్రపర్ణీనదీ తీరంలో గల తిరుక్కురుకూర్‌లో- (ఆళ్వార్ తిరునగరిలో) వేలాళకులంలో (చతుర్థవర్ణంలో) శ్రీమన్నారాయణుని విషయంలో అనన్యభక్తివిశ్వాసాలను కల కులంలో అవతరించిన తిరువళ్ళువది వళనాడర్ అనే పరమభక్తులొకరు ఉండేవారు. వారి కుమారులు అఱన్తాఙ్గియార్- అనేవారు. వారి కుమారులు శెఙ్కణ్ణర్. వారి కుమారులు పొఱ్కారియార్. వారి కుమారులు కారియార్. వారి కుమారులే **"మాఱన్"** అని, **"శడకోపన్"** అని, **"పరాంకుశన్"** అని, **"అరుళ్ మారి"** అని, **"ప్రపన్నజనకూటస్థర్"** అని- మొదలైన పలు తిరునామాలతో వ్యవహరింపబడే నమ్మాళ్వార్లు. వీరి అవతార చరిత్ర సంప్రదాయంలో సుప్రసిద్ధం. ప్రసంగానుసారంగా అది కొంచెంగా అనుసంధింపబడుతున్నది.

పొఱ్కారియార్ తమ కుమారులైన కారియార్‌కు వివాహం చేయాలని తలచి, కేరళదేశంలోని **తిరువణ్ పరిశారమ్** అనే దివ్యదేశంలో గల **"తిరువాళ్‌మార్బర్"** అనే భగవద్భక్తుల కుమార్తె అయిన ఉడైయ నఙ్జై (నాథనాయిక)ను ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకొని, ఆ ఊరిలో వారిద్దరికి గొప్పగా పెండ్లి జరిపించారు. ఆ దంపతులిద్దరు కొంతకాలం తిరుక్కురుకూర్‌లో నివసించారు. ఒకనాడు కారియార్ తన మామగారైన తిరువాళ్‌మార్బన్ కోరికను మన్నించి, ఉడైయనఙ్జైతో కలసి తిరువణ్ పరిశారమ్‌కు వెళ్ళి, అక్కడ కొంత కాలం ఉన్నారు. తిరిగి తిరుక్కురుకూర్‌కు తిరిగి వచ్చే దారిలో తిరుక్కుఱుఙ్గుడిలో వేంచేసి ఉండే నమ్బిని సేవించి, "మాకు ఒక కుమారుని సంతానంగా అనుగ్రహించు స్వామీ!" అని ప్రార్థించారు. తిరుక్కుఱుఙ్గుడి నమ్బి "నేనే మీకు పుత్రునిగా అవతరిస్తాను" అని అర్చకముఖంగా వారికి వరాన్ని అనుగ్రహించారు. నమ్బివద్దనుండి నిర్మాల్యప్రసాదాలను పొందిన కారియార్ తిరుక్కురుకూర్‌కు తిరిగి వచ్చారు. తరువాత ఉడైయ నఙ్జై కొంతకాలానికి గర్భవతియైనది. భగవానుడు లోకం ఉజ్జీవించేటట్లుగా సేనైముదలియార్‌ను నమ్మాళ్వార్లుగా అవతరించమని నియమించగా, పూర్వం తెల్పిన రీతిలో కలియుగం ప్రారంభమైన తరువాత 43వ దినాన కలిదోషాన్ని పోగొట్టడంకోసం విష్వక్సేనాంశతో నమ్మాళ్వార్లు ఈ లోకంలో ఉడైయనఙ్జైకు కుమారులై అవతరించారు.

ఈ విధంగా తిరుక్కుఱుఙ్గుడి అంశతోను, సేనైముదలియార్ అంశతోను ఆళ్వార్లు అవతరించడానికి ముందే **"శెన్దాల్ కుడైయామ్ ఇరున్దాల్ శిఙ్గాశనమామ్"** (ముదల్ తిరు-53) అనే రీతిలో నిరంతరం సర్వవిధభగవత్కైంకర్యాలను చేసే తిరువన్దాళ్వాన్ (ఆదిశేషులు) వీరిపై వర్షం ఎండ పడకుండా రక్షించడంకోసం తిరుక్కురుకూర్‌లో ఒక నిద్రించని చింతచెట్టు (నిర్మిద్రతింత్రిణీవృక్షం) గా అవతరించారు.

నమ్మాళ్వార్లు జన్మించిన మఱుక్షణంనుండి లోకరీతిలో రోదించడం, తల్లివద్ద పాలు తాగడంవంటి పనులను వేటినీ చేయకుండా, కేవలం భగవదనుభవాన్ని పొందుతూ, దానివల్ల ఏలోటు లేకుండా వర్ధిల్లారు. ఆ ఆశ్చర్యకరమైన స్థితిని చూచిన తల్లి, తండ్రి

భగవానునిపైననే భారాన్ని పెట్టి, జన్మించిన 12వ నాడు తిరుక్కురుకూర్‌లో వేంచేసి ఉండే **పొలిన్దు నిన్ఱ పిరాన్** సన్నిధికి తమ బిడ్డను తీసికొనిపోయి, భగవానుని సేవించి, భగవానుని ముందు ఆ బిడ్డను పెట్టి, లోకరీతికి మాఱుగా వర్తించే ఆ బిడ్డకు **"మాఱన్"** అనే పేరును పెట్టారు. ఆలయానికి సమీపంలో ఉండే, ఆదిశేషాంశతో అవతరించిన నిద్రించని చింతచెట్టుక్రింద బంగారు తొట్టెలో ఆ బిడ్డను పరుండబెట్టారు. ఆ దివ్యశిశువును తమ కుమారునిగా భావించకుండా "మా కులానికి నాథా !"అని ప్రశంసిస్తూ వచ్చారు. భగవానుడు సేనైముదలియార్‌ను ఆజ్ఞాపించి, మాఱన్‌కు పంచసంస్కారాలను చేయించి, అన్ని శాస్త్రార్థాలను ఉపదేశించేటట్లు చేశారు.

సాధారణంగా తల్లి గర్భంలో ఉండేటపుడు శిశువు జ్ఞానాన్ని ఆవరించే శఠమనే వాయువును నమ్మాళ్వార్లు తాము అవతరించినపుడే తమపై ఆ వాయువు ప్రభావం పడకుండా ఉండేటట్లు హుంకారంతో తరిమివేసినందువల్ల వీరికి **"శఠకోపు"** లనే పేరు వచ్చింది. **"నమ్బెరుమాళ్ నమ్మాళ్వార్ నజ్జీయర్ నమ్బిళ్ళై ఎన్బర్ అవరవర్‌తమ్ ఏన్ఱత్తాల్ అమ్బుడైయోర్ శాన్ఱ తిరునామఙ్గళ్"** అని మణవాళమహామునులు ఉపదేశరత్తినమాలైలో అనుగ్రహించిన రీతిలో నమ్బెరుమాళ్ (శ్రీరంగనాథుని)చే **"నమ్ ఆళ్వార్! అరుకే వారుమ్!"**అని అభిమానించి, పిలువబడినందువల్ల వీరికి **"నమ్మాళ్వార్"** అనే తిరునామం ప్రసిద్ధమైనది. తిరుక్కురుకూర్‌లోని పొలిన్దునిన్ఱ పిరాన్ ప్రీతితో అనుగ్రహించి వకుళమాలికను ధరించేవారు కావడంవల్ల ఆళ్వార్లకు **"నాట్కమళ్ మకిళ్ మాలై మార్బినన్"** (తిరువాయ్- 4-10-11) అని తాము స్వయంగా పల్కిన రీతిలో **"మకిళ్ మాలై మార్బినన్"** అని, **"వకుళాభరణు"**లని పేరు కల్గింది. ఇతరమతస్థులనే మదగజాలను తమ దివ్యప్రబంధాలలో అనుగ్రహించిన తత్త్వార్థాలతో జయించి, వారి మదం అణచి, వారికి అంకుశం అయినందువల్ల **"పరాంకుశు"**లనే పేరు కల్గింది.

ఇటువంటి వైలక్షణ్యాన్ని కల నమ్మాళ్వార్లు తమవలె భగవదనుభవంలో అభినివేశాన్ని కల్గిన శిష్యులు కన్పించనందువల్ల పదహాఱు సంవత్సరాలవరకు మౌనంగానే ఉండి పోయారు. అపుడు మధురకవి ఆళ్వార్లు అనే వీరికి సమకాలీనులైన భక్తాగ్రేసరులు తీర్థయాత్రాక్రమంలో ముక్తినగరాలుగా ప్రసిద్ధి పొందిన అయోధ్య, మధుర, మాయ, కాశి, కాంచి, అవంతి, ద్వారక-అనే ఏడు నగరాలను, ఇంకా పలు దివ్యదేశాలను సేవించాలని బయలుదేరారు. ఆ ప్రయత్నంలో అయోధ్యానగరాన్ని చేరి, అచట

అర్చారూపిగా వేంచేసి ఉండే శ్రీరాముని, సీతాదేవిని సేవించి కొంతకాలం అక్కడే ఉన్నారు. అపుడు మధురకవులు ఒకనాటి రాత్రి తమ జన్మస్థలం అయిన తిరుక్కోళూర్ అనే దివ్యదేశంలో ఉండే స్వామి దిశ అయిన దక్షిణం వైపు తిరిగి నమస్కరించబోగా, ఆకాశంలో గొప్ప తేజస్సు వారి కంటికి కన్పించింది. అదే రీతిలో రెండు మూడు దినాలు అదే విధంగా జ్యోతిస్సు కన్పించగా, "ఇది ప్రాకృతమైన తేజస్సు కాదు; ఇది ఏమో తెలిసికోవాలి" అని పగటి కాలం అంతా నిద్రించి, రాత్రివేళ ఆ తేజస్సు కన్పించే వైపు ప్రయాణాన్ని చేయసాగారు. క్రమంగా శ్రీరంగాన్ని చేరి చూడగా అక్కడికి కూడా దక్షిణం వైపుగా జ్యోతిస్సు దర్శన మిచ్చింది. మధురకవులు ఆ దిశలో తమ పయనాన్ని కొనసాగించి చివరకు తిరుక్కురుకూర్ చేరి, చూడగా ఆ జ్యోతిస్సు కన్పించలేదు. అందువల్ల ఆ జ్యోతిస్సు ఆ ఊరిలోనే ఉండి ఉండాలని నిశ్చయించుకొని, అక్కడ విచారించారు. నిర్మ్రదతింత్రిణీవృక్షం నీడలో పద్మాసననోపవిష్టులై, పరతత్త్వబోధన ముద్రతో మహాతేజస్వియై, పరమాచార్యులై వేంచేసి ఉండే నమ్మాళ్వార్లను దర్శించి, "వీరే ఆ తేజస్సు" అని నిశ్చయించుకొన్నారు. వారి సేవ కోసం చిరకాలం వేచిఉన్నారు.

ఎంతసేపు వేచి ఉన్నా, ఆళ్వార్లు కళ్ళు తెరవలేదు. మాటలాడలేదు. అపుడు "వీరికి చెవులు వినబడతాయా? జ్ఞానం ఉన్నదా !" అని పరీక్షించడంకోసం మధురకవులు ఒక గుండ్రాయిని ఎత్తి వారి ముందు పడవేశారు. అపుడు వచ్చిన చప్పుడును విని నమ్మాళ్వార్లు గభాలున కళ్ళు తెఱచి చూచారు. మధురకవులు "వీరు మాటలాడగలరా!" అని తెలిసికోదలచి **"శెన్ఱత్తిన్ వయిన్ఱిలే శిఱియదు పిఱన్దాల్ ఎత్తై త్తిన్ఱు ఎఱ్ఱే కిడక్కుమ్?"** (జ్ఞానశూన్యం అయిన శరీరంతో అణుపరిమాణుడైన జీవునకు సంబంధం ఏర్పడితే, ఆ జీవుడు దేనిని అనుభవిస్తూ దేనిని ఆశ్రయించుకొని ఉంటాడు?) అని ఆళ్వార్లను ప్రశ్నించారు. ఆళ్వార్లు వెంటనే **"అన్ఱై త్తిన్ఱు అఱ్ఱే కిడక్కుమ్"** (ఆ ఆత్మ శరీరాన్నే - అంటే - ఆ శరీరంవల్ల కలిగే సుఖదుఃఖాలనే అనుభవిస్తూ, ఆ శరీరాన్నే ఆశ్రయించుకొని ఉంటాడు.) అనే బదులును ఇచ్చారు. దానిని విన్న మధురకవులు "వీరు అన్నీ తెలిసిన మహాజ్ఞాని. వీరిని ఆశ్రయించి ఉజ్జీవించాలి" అని భావించి ఆళ్వార్ల శ్రీచరణాలపై పడి సేవించి, వారినే సర్వస్వంగా భావిస్తూ వారికి సకలవిధకైంకర్యాలను చేయసాగారు. ఆళ్వార్లు భగవదనుగ్రహంవల్ల నిర్దుష్టమైన తత్త్వజ్ఞానాన్ని **"మయర్వఱ మదినల మరుళినన్"** అనే రీతిలో పొంది, ఆ భగవానునితో కల్గిన మానససాక్షాత్కార రూపసంబంధంచేత అమందానందాన్ని పొందినవారై, ఆ ఆనందపరీ వాహరూపంగా ఋగ్వేదసారం అయిన తిరువిరుత్తం, యజుర్వేదసారం అయిన తిరువాశిరియం,

అధర్వణవేదసారం అయిన పెరియతిరువన్దాది, సామవేదసారం అయిన తిరువాయ్‌మొళి- అనే నాల్గు దివ్యప్రబంధాలను మధురకవులకు అనుగ్రహించి, వాటి అర్థవిశేషాలను వారికి బోధించారు. ఆ తరువాత పరమపదాన్ని చేరారు.

నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళిని అనుగ్రహించేటపుడు ఆ దివ్యప్రబంధ మాధుర్యాన్ని అనుభవించడంకోసం దివ్యదేశాలలోని అర్చామూర్తులు బారులు తీర్చి నిలబడ్డారని పూర్వాచార్యుల రసోక్తి. **"శెవిక్కినియ శెళ్ళొల్"** గా కీర్తింపబడే ఆ దివ్యప్రబంధమధురిమలో ఆసక్తులై నిత్యసూరులు, శ్వేతద్వీపవాసులైన ముక్తులు, ఈ లోకంలో ఉండే భగవద్భక్తులు గుంపులు గుంపులుగా చేరారు. ఇది వారి సూక్తిమహిమ. ఆ భాగవత సమృద్ధిని చూచి ఆళ్వార్లు తిరువాయ్‌మొళిలోని **"పాలిక పాలిక పాలిక"** అనే దశకంద్వారా వారికి మంగళాశాసనాన్ని చేశారు. అవతరించిన నాటినుండి ఇహలోకజీవనంపై అభినివేశం లేకుండా, తల్లిపాలు సైతం తాగకుండా, తులసి మొలిచేటపుడే పరిమళంతో మొలిచే రీతిలో, భగవానుడు అనుగ్రహించిన విశుద్ధజ్ఞాన భక్తులను కలవారై ఉన్నందువల్ల **"వాసుదేవ స్సర్వ మితి స మహాత్మా సుదుర్లభః"** (గీత- 6-19) అని అంటూ గీతాచార్యుడు సెలవిచ్చిన మహాత్ములు ఈ ఆళ్వార్లేనని సుస్పష్టమవుతున్నది. ఇది ఆళ్వార్ల మహిమ. ఇందువల్లనే నమ్మాళ్వార్లను ప్రపన్నజనకూటస్థులని, ఆళ్వార్లు అందటిలో అంగి అని పెద్దలు వచించారు.

నమ్మాళ్వార్లకు పూదత్తాళ్వార్లు శిరస్సు, పొయ్‌కై ఆళ్వార్లు, పేయాళ్వార్లు నేత్రాలు, పెరియాళ్వార్లు ముఖం, తిరుమళిశై ఆళ్వార్లు కంఠం, కులశేఖరులు, తిరుప్పాణ్ ఆళ్వార్లు హస్తాలు, తిరుమఙ్గై ఆళ్వార్లు నాభి, మధురకవులు పాదాలు, భగవద్రామానుజులు పాదుకాస్థానీయులు- అని అభిజ్ఞులైన పెద్దల సూక్తి. భగవానుని శ్రీచరణస్థానీయులుగా కీర్తింపబడే నమ్మాళ్వార్లకు ప్రతిరూపంగా అన్ని విష్ణ్వాలయాలలో ఉండే పాదుకలు **శఠారి** అని, **శఠకోపన్** అని వ్యవహరింపబడుతున్నవి. ఇక, ప్రకృత ప్రబంధం అయిన పెరియతిరువన్దాది వైభవంగూర్చి - సంగ్రహంగా విన్నపింప బడుతున్నది.

పెరియతిరువన్దాది - చరమశ్లోకార్థసారం :- దివ్యసూరులు అనుగ్రహించిన నాలాయిర దివ్యప్రబంధవాఙ్మయంలో అంతర్భవించిన **24** ప్రబంధాలు అష్టాక్షరి, చరమశ్లోకం, ద్వయం అనే రహస్యత్రయంలోని అర్థాన్ని అనుసంధిస్తున్నవి- అని వ్యాఖ్యాతలైన పూర్వాచార్యుల అభిప్రాయం. ఆ వివరణక్రమంలో ముదలాయిరం అనబడే

ప్రథమసహస్రంలోని తిరుప్పల్లాణ్డు ప్రబంధంనుండి అమలనాదిపిరాన్ అనే దివ్య ప్రబంధంవరకు గల ప్రబంధాలు అష్టాక్షరిలోని ప్రణవంయొక్క అర్థాన్ని అనుసంధించగా, **కణ్ణినుణ్ శిఱుత్తామ్బు** నమశ్శబ్దార్థ ప్రతిపాదకం. ఇక, అష్టాక్షరిలో **"నారాయణాయ"** అనే మూడవపదంయొక్క అర్థాన్ని పెరియతిరుమొళి, తిరుక్కుఱున్దాణ్డకమ్, తిరునెడున్దాణ్డకమ్- అనే ప్రబంధాలు వివరిస్తున్నాయి. ఈ విధంగా ముదలాయిరం, రెండవ ఆయిరం చివరివరకు గల ప్రబంధాలలో అష్టాక్షరీ మంత్రార్థానుసంధానం చేయబడింది. ఇక, మూడవ ఆయిరం అయిన ఇయఱ్పా సాకల్యంగా చరమశ్లోకార్థాన్ని అనుసంధిస్తున్నదని, తిరువాయ్‌మొళి అనే నాల్గవ ఆయిరం ద్వయార్థానుసంధానాన్ని చేస్తున్నదని పూర్వాచార్యుల అభిప్రాయం. రహస్యత్రయంలో అష్టాక్షరి తరువాత చరమశ్లోకం, తరువాత ద్వయమంత్రం - అనే క్రమాన్నిబట్టి ఈ వివరణ చేయబడింది. ఈ క్రమం శ్రీపిళ్ళైలోకాచార్యులవారు, శ్రీదేశికులవారివంటి పూర్వాచార్యులచేత అనుసరింపబడింది. ఈ క్రమంలోని సామంజస్యాన్ని ముముక్షుప్పడి వ్యాఖ్యలో ద్వయ ప్రకరణ ప్రారంభంలో శ్రీవరవరమునులు చేసిన వివరణాన్ని, ఆ సందర్భంలో **"ఆక, ద్వయచరమశ్లోకఙ్గళ్ ఇరణ్డుమ్ విధ్యనుష్ఠానరూపఙ్గళా యిరుక్కైయాలే ఉపాయ విధాయకమాన చరమశ్లోకార్థత్తై అరుళిచ్చెయ్‌త అనన్తరమ్ ఉపాయానుష్ఠాన ప్రతిపాదకమాన ద్వయార్థత్తై అరుళిచ్చెయ్‌కై యుక్త మెన్ఱు కరుత్తు"** ఇత్యాదిగా దొడ్డయాచార్యులవారు చేసిన అరుంబద వివరణాన్ని అనుసంధించాలి. ఇందువల్ల ప్రపత్తివిధిని తెలిపే చరమశ్లోకంయొక్క అర్థాన్ని అనుసంధించే దివ్యప్రబంధాలను మూడవ ఆయిరంగాను, అనుష్ఠానాన్ని తెలిపే ద్వయంయొక్క అర్థాన్ని అనుసంధించే తిరువాయ్‌మొళిని నాల్గవ ఆయిరంగాను శ్రీమన్నాథమునులు కూర్చారు. ఇయఱ్పాలోని మొదటి ప్రబంధమైన ముదల్ తిరువన్దాదినుండి ఆరంభమైన చరమశ్లోకార్థానుసంధానం ఆసహస్రంలోని పలుప్రబంధాలలో కొనసాగింపబడింది. ముదల్ తిరువన్దాదిలోని **"అడైన్ద అరువినైయోడు"** అనే 59వ పాశురాన్ని వ్యాఖ్యానిస్తూ పెరియవాచ్చాన్‌పిళ్ళై - **"ఇతుక్కు కీళ్ ఎల్లామ్ షట్కృతయత్తిల్ శొన్నవార్‌త్తైప్పోలే స్వరూపమ్ విశదమాక్కు కైక్కు చ్చొన్న నిలై. ఇతు చరమశ్లోకత్తిన్ నిలైపోలే"** అని పల్కడం వల్ల ఈ పాశురం చరమశ్లోకార్థాను సంధానాన్ని చేస్తున్నదని తెలుస్తున్నది. ఈ చరమ శ్లోకార్థమే తర్వాత ఇయఱ్పాలోని పలు ప్రబంధాలలో పునఃపునః అభ్యాసం చేయబడింది. అందువల్ల ఇయఱ్పా పూర్తిగా చరమశ్లోకార్థ ప్రతిపాదకం. ఇపుడు చరమశ్లోకార్థాన్ని వివరించే మూడవ ఆయిరం **"ఇయఱ్పా"**లో అంతర్భవించే పెరియ తిరువన్దాది ప్రబంధం ఏ విధంగా ఆ చరమ శ్లోకార్థాన్ని అనుసంధిస్తున్నది? అనే విషయం సంగ్రహంగా ప్రతిపాదింపబడుతున్నది.

చరమశ్లోకంలోని **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనే ప్రయోగంవల్ల ఉపాయాంతరాలు స్వప్రయత్నసాధ్యాలు కనుక, అవి భగవానునకు దూరం కావడానికి హేతువులు కాబట్టి అవి విడువదగినవి- అనే అర్థం తెలుపబడింది. **"మామేకం శరణం వ్రజ"** అనే సూక్తిద్వారా భగవానుడొక్కడే సాక్షాన్మోక్షోపాయం అని, **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి"** అనే సూక్తివల్ల భగవానుని ఉపాయంగా ఆశ్రయించినవారి పాపాలు అన్నీ నశిస్తాయని, **"మా శుచః"** అనే పదంవల్ల అనిష్టనివృత్తిని, ఇష్టప్రాప్తిని కల్గించే ఉపాయమైన అతనిని ఆశ్రయించినవారికి ఏ దుఃఖం ఉండదనే అర్థం తెలుపబడింది. ఈ అర్థాలు చరమశ్లోకంలో సంగ్రహంగా తెలుపబడ్డాయి. వీటిని పెరియతిరువన్దాది ప్రబంధం మొదట సంగ్రహంగా, క్రమంగా వివరంగా ప్రతిపాదించింది.

భగవద్భాష్యకారులు గీతాభాష్యంలో చరమశ్లోకాన్ని మొదట భక్తియోగపరంగా సామాన్యంగా వ్యాఖ్యానించి (దీని వివరం విస్మృతిభీతివల్ల ప్రస్తావించడం లేదు) ఆ తరువాత పరమగుహ్యం అయిన ప్రపత్తిని దృష్టిలోపెట్టుకొని **"అథవా"** అని ప్రారంభించి రెండవ రీతిలో వివరిస్తూ- భక్తియోగాన్ని అనుష్ఠించాలంటే అది అన్ని పాపాలనుండి విడివడిన, అత్యర్థమైన ప్రీతిని భగవానుని విషయంలో కల్గి ఉన్నవానికే అది సాధ్యం కనుక, ఆ భక్తియోగాన్ని ఆరంభించడానికి అడ్డుగా ఉండే పాపాలు అన్నీ తనకు తీరనందున, తాను అయోగ్యుణ్ణి అయ్యానే! అని శోకించే అర్జునుని శోకాన్ని తలుస్తూ భగవానుడు చరమశ్లోకాన్ని అతనికి ఉపదేశించాడని వ్యాఖ్యానించారు. అందువల్ల భగవానుడు **"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ"** ఇత్యాదిగా ఉపదేశించిన భక్తియోగం తదంగాలైన కర్మ, జ్ఞాన యోగాలు స్వప్రయత్నసాధ్యాలు. కనుక, అవి దురనుష్ఠేయాలు. భగవానుడొక్కడే ఉపాయం. అతనిని ఆశ్రయిస్తే భక్తిని అనుష్ఠించడానికి అడ్డుగా ఉండే విరోధులనన్నిటిని అతడు తీరుస్తాడు. అపుడు అనుష్ఠించే భక్తి ఉపాయ కోటిలోనికి చేరదు. భుజించేవారికి ఆకలి కల్గి ఉండడం వారి స్వరూపంలో అంతర్భవించేటట్లు, ఈ భక్తి స్వరూపగతం. అందువల్లనే భాష్యకారులు. **"స్వరూపభక్త్యారంభవిరోధిభ్యః"** అని ప్రయోగించారు. **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి"** అనే సూక్తి ప్రాక్తనకర్మ విమోచనం భగవానునివల్లనే కల్గుతుందని తెలుపడంవల్ల అనిష్టనివృత్తి భగవత్కరుణాయత్తమని ఏర్పడుతున్నది. చరమశ్లోకంలో చెప్పబడ్డ అనిష్టనివృత్తి ఇష్టప్రాప్తికి ఉపలక్షణం అని పూర్వాచార్యసూక్తి. కనుక ఇష్టప్రాప్తికూడా భగవద్దయాయత్తమే. ఇదే పరగతస్వీకారం. దీనిని **"య మేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూమ్ స్వామ్"** అనే శ్రుతి తెల్పుతున్నది. గీతాభాష్యంలోని ఈ వివరణం **"మా శుచః"** అనే ప్రయోగాన్ని దృష్టిలో పెట్టుకొని చేయబడింది.

ఇపుడు పెరియతిరువన్దాది ప్రబంధంలోని ఆఱువ పాశురాన్ని, దాని వ్యాఖ్యను కొంచెం అనుసంధానం చేద్దాం. పాశురం **"నెఞ్చి కాట్టు నీక్కుదియో నిన్బాల్"** అని ప్రారంభమవుతున్నది. ఈసూక్తిని వ్యాఖ్యానించే వ్యాఖ్యాతృచక్రవర్తి పెరియవాచ్చాన్‌పిళ్ళై- **"నెఞ్చి కాట్టుకై ఎన్నుమ్ నీక్కుకై ఎన్నుమ్ పర్యాయమ్. మద్యాజీ మాం నమస్కురు- ఎన్న, అర్జునునుక్కు శోక విషయమాయి*ర్*ర్‌తే"** అని వివరించారు. ఇందువల్ల **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనే చరమశ్లోక సూక్తిని పాశురంలోని **'నెఞ్చి కాట్టి నీక్కుదియో నిన్బాల్'** అనే ప్రయోగం అనుసంధిస్తున్నదని తెలుస్తున్నది. **"నిన్బాల్ కరుమా ముగిమేని కాట్టుదియో"** అనే పాశురంలోని అనంతరభాగం **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి"** అనే సూక్తిని అనుసంధిస్తున్నది. ఈ పాశురభాగాన్ని వివరిస్తూ **"(నిన్బాల్ కరు మా ముగిమేని కాట్టుదియో) - ఎన్నుమామ్. 'విపృణుతే" ఎన్నుమాపోలే... శ్యామమాయ్ సుకుమారమాన తిరుమేనియై నీయే కాట్టి అనుభవిప్పుతియో"** అని పల్కడం దీనిని నిరూపిస్తున్నది. అదే విధంగా **"ఎన్ శెయ్యా నెఞ్ఞినాయ్"** అనే ప్రయోగాన్ని **"మన్మనా భవ ఎన్నప్పార్‌త్తాయో! "మా మేకం శరణం వ్రజ- ఎన్నప్పార్‌త్తాయో!"** అని, **"కణ్ణనే ఈతురై యాయ్"** అనే ప్రయోగాన్ని **"మా శుచః - ఎన్ను శొల్లుకై భర మిదే"** అని పెరియవాచ్చాన్‌పిళ్ళై వివరించడంవల్ల ఈ రెండుకూడా చరమశ్లోకార్థాన్ని అనుసంధిస్తున్నాయనే విషయం సుస్పష్టం. **"కణ్ణనే!"** అనే శ్రీకృష్ణుని నిర్దేశించే సంబోధనకూడా ఇక్కడ చాలా సాభిప్రాయకం. ఈ విధంగా ఆఱువ పాశురం చరమశ్లోకార్థాన్ని సాకల్యంగా ప్రతిపాదిస్తున్నదని పూర్వాచార్యహృదయం. కనుక ఇది చరమశ్లోకార్థసంగ్రహం.

ఈ విధంగానే పెరియతిరువన్దాదిలో తరువాత గల పలు పాశురాలు చరమశ్లోకార్థాన్ని అనుసంధిస్తున్నవి. **"వానోరినైత్తలైవన్ కణ్ణనాల్ యాన్ శిరార్ మనత్తలైవన్ వన్‌తున్బత్తై మా*ర్*ర్‌నేన్"** (25) **"మా మేని ఎమ్మిజైయార్ తన్ద అరుళెన్నుమ్ తణ్డాల్ అడిత్తు వల్‌వినైయై కానుమ్ మలైయుమ్ పుక క్కడివాన్"** (26) **"వానో మఱికడలో.. ఆనీట్ట కట్టయర త్తామెఱిన్దు కాయుదిర్‌త్తార్ త్తాళ్ పణిన్దోమ్... తుయరై కణ్డిలమ్ ఆల్"** (54) **"ఎప్పోదుమ్ కైకూలా నేమియాన్ నమ్మేల్ వినై కడివాన్"** (87) ఇత్యాది సూక్తులద్వారా **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"** అనే సూక్ష్మార్థం, **"ఈన్ తుళాయ్ మాయనైయే నెఞ్జే! తాళై మావెన్నరకిల్ శేరామల్ కాప్పదఱ్కు ఇళై కాణ్ మ*ర్*ర్‌రిజై"**, **"ఇరైక్కుమ్ కడల్ కిడైన్ద ఎన్దాయ్! ఉరైప్పెల్లామ్ నిన్నట్టి మ*ర్*ర్‌లేన్ కణ్డాయ్! ఎనతుయర్‌క్కోర్ శొల్‌నట్టి యాకుమ్ తుణైై"**, **"నీఙ్గాద మాకతియామ్ వెన్నరకిల్ శేరామల్ కాప్పదఱ్కు నెఞ్జే! నీ శెఙ్గణ్ మాల్ కటియా నినై"** ఇత్యాది సూక్తులు **"సర్వధర్మాన్**

పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ" అనే ప్రయోగార్థాన్ని వివరిస్తున్నాయని గమనించవచ్చు. ఈ సూక్తులేకాక, ఇంకా పలు పాశురాలలోని ప్రయోగాలు చరమశ్లోకార్థాను సంధాయకాలు - అనే అంశం విస్తరభీతిచేత వివరించడం లేదు.

ఈవిధంగా ప్రబంధ ప్రారంభంలో అనుసంధింపబడ్డ చరమశ్లోకార్థం మధ్యలో, చివరలోకూడా అనుసంధింపబడడాన్ని స్పష్టంగా గమనించవచ్చు. 56వ పాశురంలోని **"ఒరు ఆఱు ఒరువన్ పుకా వాఱు ఉరు మాఱుమ్"** అనే సూక్తిని వ్యాఖ్యానిస్తూ పెరియవాచ్చాన్‌పిళ్ళై- **"ఎల్లా ఉపాయఙ్గళైయుమ్ విట్టు ఎన్నైయే పఱ్ఱు ఎన్ఱ"** అని పల్కడం వల్ల, 77వ పాశురంలోని **"ఎన తుయర్‌క్కోర్ శొల్ నన్ని యాకుమ్ తుణై నిన్నట్టి మఱ్ఱిలేన్ కణ్డాయ్!"** అనే సూక్తిని పెరియవాచ్చాన్‌పిళ్ళై- **"దుర్దశైయిల్ మా శుచః" ఎన్ఱ వఱ్ఱాల్లు శొల్లు మత్తై. ఉరైక్కప్పడువతెల్లామ్ ఉన్నై యొழிయ వేఱొరువరిల్లై"** అని వివరించడంవల్ల ఈసూక్తులు రెండు చరమశ్లోకంలోని పూర్వార్ధ - ఉత్తరార్ధాలలోని అర్థాలను అనుసంధిస్తున్నవనే విషయం ప్రస్ఫుటం. ఈ రీతిలో పెరియతిరువన్దాది ప్రబంధంలో అదిమధ్యావసానాలలో చరమశ్లోకార్థం. ప్రతిపాదింపబడడంవల్ల ఈ ప్రబంధం సాకల్యంగా చరమశ్లోకార్థప్రతిపాదకం ఈ ప్రబంధం చివరలో గల **"కైకలన్ద వాழ்వియాన్ శీర్ కలన్ద శొల్"**, **"ఎప్పోదుమ్ కైకழలా నేమియాన్ నమ్మేల్ వినై కడివాన్"** అనే ప్రయోగాలుకూడా శ్రీకృష్ణుడు ఉపదేశించిన చరమశ్లోకాన్ని సూచిస్తున్నవని చెప్పడంలో విప్రతిపత్తి ఉండదుకదా! ఈప్రబంధంలోని పలు పాశురాలలో శ్రీకృష్ణునిగూర్చిన సంబోధనలు చేయబడడం, ఆ స్వామి లీలలు వివిధంగా పేర్కొనబడడంకూడా గమనించదగినది. **"ఎన్నక్కరుళ్శోతి క్కణ్ణన్"** (4) **"ఎన్ శెయ్‌వా నెణ్ణినాయ్ కణ్ణనే"** (6), **"కణ్ణన్‌తాళ్ వాழ்త్తువతే కణ్డాయ్ వழుక్కు"** (12), **"కణ్ణనాల్ యాన్ తుయ్ఱతై మాఱ్ఱినేన్"** (25) **"కణ్ణనుక్కే తీర్న్దాల్"** (36), **"కణ్ణనార్ పేరురు వెన్దైమ్మై ప్పిరిన్దు"** (49), **"కణ్ణన్ తాళ్ వాழ்త్తువతే కల్"** (67), **"కోవలనార్ ఒన్ఱు మిరజ్గార్"** (74), **"ఎన్నుయిరై కణ్ణన్‌పాల్"** (85) అనే సంబోధనలు అన్నీ శ్రీకృష్ణునివే. చరమశ్లోకంలో ఆర్థికంగా స్ఫురించే ఇష్టప్రాప్తి, పరగతస్వీకారం, **"వ్రజ"** అనే పదంద్వారా స్ఫురించే ఆభిముఖ్యం, **"మామ్"**, **"అహమ్"** అనే సర్వనామపదాలలో వ్యక్తమవుతున్న వాత్సల్య, సౌలభ్య, సౌశీల్య, శక్తి, జ్ఞానాది కల్యాణగుణాలు మొదలైన చరమశ్లోకంలోని పలు అంశాలు ఎన్నో పాశురాలలో ప్రతిపాదింపబడ్డాయి; వ్యాఖ్యానింపబడ్డాయికూడా.

పెరియతిరువన్దాదినామసార్థక్యం :- ఈ ప్రబంధానికి పెరియతిరువన్దాది అనే పేరు కల్గడానికి గల కారణాన్నిగూర్చికూడా విచారించవలసి ఉన్నది. ఈ ప్రబంధం

ముదలాழ்వార్ల ప్రబంధాలవలె పూర్తిగా 100 పాశురాలను కల్గినది కాదు. అయినా **"పెరియ"** అనే విశేషణం ఈప్రబంధానికి ఏర్పడడంలోని హేతువును పెద్దలు ఈ విధంగా వివరించారు. ఆழ్వార్లు ఈప్రబంధంలోని 71వ పాశురంలో **"నిన్ పెరుమై యానురైప్పతు ఎన్దే"** అని అంటూ భగవానుని పెరుమై (గొప్పతనాన్ని) గూర్చి పలికారు. తర్వాత 75వ పాశురంలో **"పువియుమ్ ఇరు విశుమ్బుమ్ నిన్నకత్త నీ ఎన్ శెవియిన్ వழி పుకున్ద ఆవివిట్ట ఎన్ ఉళ్ళాయ్, యాన్ పెరియన్ నీ పెరియై యెన్బదనై యార్ అఱివార్ శొల్లు"** (ఈ లీలావిభూతి, నిత్యవిభూతిలో నీలో ఏకదేశంలో ఉన్నాయి. అటువంటి నీవు నా చెవిద్వారా ప్రవేశించి ఏ అడ్డు లేకుండా నా మనస్సులో ఉన్నావు.) నీలో అన్ని లోకాలను ఇముడ్చుకొన్న నీవు పెద్దవాడవా? అటువంటి నిన్ను నాలో అంతర్భవించుకోగల్గిన నేను పెద్దవాడనా? చెప్పు) అని చమత్కరించినందున ఈ ప్రబంధానికి **"పెరియ తిరువన్దాది"** అనే పేరు, తిరునగరిలోని ఆழ్వార్లకు **"పెరియన్"** అనే పేరు ఆழ్వార్ కల్గిందని పెద్దలంటారు.

అన్దాదిప్రబంధం - ఈ ప్రబంధప్రమేయం :- ద్రావిడవాఙ్మయంలో మండల అన్దాదిప్రక్రియ విశిష్టమైనది. ఇది సంస్కృతంలోని ముక్తపదగ్రస్తంవంటిది. మొదటి పాశురంలోని చివరి పదం, లేక పదాంశం, లేక పదసమూహం, రెండవ పాశురం ప్రారంభంలో రెండవ పాశురం చివర మూడవ పాదం ఆరంభంలో - ఈ విధంగా చివరి పాశురం చివరి పదం, లేక పదాంశం, లేక పదసమూహం మొదటి పాశురం మొదట ఉండేటట్లు కూరిస్తే, ఆ ప్రబంధం శాబ్దికమైన మండల అన్దాది అనబడుతుంది. మొదటి పాశురం ప్రమేయంతో రెండవ పాశుర ప్రమేయానికి, రెండవ పాశుర ప్రమేయంతో మూడవ పాశుర ప్రమేయానికి - ఈవిధంగా చివరి పాశుర ప్రమేయంతో మొదటి పాశుర ప్రమేయానికి సంబంధం ఉండడం అనే అర్థపారంపర్యం ఉంటే ఆ ప్రబంధం ఆర్థికమైన అన్దాది. ఈప్రక్రియ ప్రకృత ప్రబంధప్రమేయానికి చాలా తగినది. ఈ ప్రబంధ ప్రమేయాన్నిగూర్చి పెరియవాచ్చాన్‌పిళ్ళై- **"తిరువన్దాదియిల్...."** నిన్న నిలైయిలే **"మొయ్‌కழలే ఏత్త ముయల్"** ఎన్ఱ తలైక్కట్టుకైయాలే విషయానురూపమాక అనుభవమ్ పెరుకిఱపడి శొల్లుకిఱతు" అని వివరించగా, దీనిని అరుంబదకారులు. **"నిన్న నిలై యావతు ముతల్ తొడఙ్గి ముడియ అనుభవియానిఱ్ఱి చ్చెయ్‌దేయుమ్, అభినివేశమ్ పెరుకి, "ఏత్త ముయల్"** ఎన్ఱ పిన్నైయు ముద్యోగ మఱామల్ నిన్న నిలై-ఎన్ఱపడి" అని వివరించారు. ప్రబంధం ముగిస్తూ చివర ప్రారంభించడమనే అర్థాన్ని ఇచ్చే **"ముయల్"** అనే పదాన్ని ఆழ్వార్లు ప్రయోగించడంలోని చాతుర్యం అనితర

సాధారణం. ముగించే పదంతో ప్రారంభం కావడమేకదా మండల అన్వాదిప్రక్రియ. భగవానుని వైభవం అంతు లేనిది. ఎంత అనుభవించినా అనుభవించవలసిన అంశమే ఎక్కువగా ఉంటుంది. కనుక అర్థస్వభావాన్నిబట్టికూడా మండల అన్వాదిప్రక్రియ అనురూపమైనది. ఈ రీతిలో శబ్దతః, అర్థతః మండల అన్వాది ప్రక్రియ ప్రకృత ప్రబంధానికి చాలా అనురూపమైనదని తెలుస్తున్నది.

పెరియతిరువన్వాదిలో మిగిలిన ఆళ్వార్ల సూక్తుల భావసామ్యాలు : నమ్మాళ్వార్లు అంగి-అంటే-ప్రధానులని, అట్లే వారి ప్రబంధాలు ప్రధానాలని, వాటిలోని భావాలకు, ప్రయోగాలకు మిగిలిన ఆళ్వార్ల భావాలతో, ప్రయోగాలతో సామ్యం ఉన్నదని అభిజ్ఞులైన ఆచార్యుల అభిప్రాయం. అందువల్ల **"పేశిన్‌ఱే పేశలల్లాల్"** అనే ప్రయోగానికి దివ్యసూరులందఱు లక్ష్యభూతులే. ఇపుడు పెరియతిరువన్వాదిలోని ఆళ్వార్ల సూక్తులతో కొంతమంది ఆళ్వార్ల సూక్తులకుండే అర్థసామ్యం సంగ్రహంగా సూచింపబడుతున్నది.

ఆణ్డాళ్ : ఆళ్వార్లు 9వ పాశురంలో ఈ శరీరంతోనే సాక్షాత్తుగా భగవానుని దర్శించి, ఆలింగనం చేసికోవాలని ఆశపడి, అది లభించకపోవడం వల్ల **"ఎమక్కు ఇని యాతానుమ్ ఆకిడుకాణ్ నెఞ్జే!"** అని అన్నారు. ఈ సూక్తిని పెరియవాచ్చాన్‌పిళ్ళై- **"పశిత్తపోతు కిడైయాత శోఱెన్ శెయ్య!"** అని వ్యాఖ్యానించారు. అదే రీతిలో పెరియతిరువన్వాది 13వ పాశురంలోని **"ఎన్ కణ్‌గళ్ తమ్మాల్ కాట్టువాన్ ఉన్ మేని చ్చాయ్"** అనే సూక్తిని- **"గాత్రైః శోకాభికర్శితైః - ఎన్నుమ్మడియే దేహంతరే దేశాంతరే కాణవొణ్ణాతు. విడాయ్త్త కణ్‌గళాలే కాణవేణుమ్"** అని వివరించారు. ఈ రెండు సూక్తులకు, గోదాదేవి నాచ్చియార్ తిరుమొళిలోని **"కొమ్మై ముళైకళ్ ఇడర్ తీర కోవిన్దర్ క్కోర్ కుఱ్ఱేవల్ ఇమ్మై ప్పిఱవి శెయ్యాతే ఇని ప్పోయ్ చ్చెయ్యుమ్ తవన్దానెన్ ?"** (13-9) అనే సూక్తితో గల అర్థసామ్యం గమనించదగినది.

2. పొయ్‌కై ఆళ్వార్లు : ముప్పై మూడుమంది దేవతల వివరాన్నిగూర్చి ప్రస్తావిస్తూ ఆళ్వార్లు 10వ పాశురంలో **"ఇరునాల్వర్ ఇరైన్దిన్ మేల్ ఒరువర్ ఎట్టోడు ఒరు నాల్వర్ ఓరిరువర్"** అని అన్నారు. గోదాదేవి సంగ్రహంగా **"ముప్పత్తు మూవర్ అమరర్"** అని అన్నది. పొయ్‌కై ఆళ్వార్లు **"ఎణ్‌మర్ పదినొరువర్ ఈరఱువర్ ఓరిరువర్"** అని అంటూ ఈ ముప్పై మూడు సంఖ్యను తెలిపారు.

ఆళ్వార్లు 52వ పాశురంలో **"మాయవళ్ నఞ్జు ఊణ్‌పావిత్తు ఉణ్డాన్"** (వంచకి అయిన పూతన స్తన్యానికి పూయబడ్డ విషాన్ని శ్రీకృష్ణుడు ఆహారంగా భావించి

భుజించాడు) అని అన్నారు. ఇదే భావాన్ని పొయ్‌కై ఆళ్వార్లు **"పేయ్ ముళై నఞ్జు ఊణాక ఉణ్డాన్"** (11) అని అన్నారు. **"ఇవనుమ్ ఉణ్డా విడిల్ తరియేన్" ఎన్ఱ ధారకమాక ఉణ్డాన్- "పేయ్ ముళై నఞ్జు ఊణాక ఉణ్డాన్" ఎన్నుమ్బడియే"** అని అంటూ పెరియవాచ్చాన్‌పిళ్ళై తమ వ్యాఖ్యలో ఈ రెండు సూక్తుల అర్థసాదృశ్యాన్ని సూచించారు.

3. పేయాళ్వార్లు : ఆళ్వార్లు 27వ పాశురంలో త్రివిక్రమావతార సందర్భంలో భగవానుడు తన శ్రీచరణాలతో భూమ్యాకాశాలను కొలిచిన సన్నివేశాన్ని **"శెఱి కళల్‌కళ్ తాళ్ నిమిర్త్తు ఉలక మెల్లామ్ శెన్ఱు అళన్ద వన్ఱు అడియాల్ పడికడన్ద ముత్తో?"** అని కీర్తించారు. "స్వామీ! ఇపుడు నేను దర్శించే అందం ఆనాడు నీవు గాఢంగా అలంకరింప బడ్డ శ్రీచరణాలతో లోకాలను అన్నిటిని కొలిచినప్పటి సంతోషమా !" అని దీని భావం. ఈసూక్తిలో **"శెఱి కళల్‌కళ్"** అని అంటూ స్వామి శ్రీచరణాలు ముత్యాలతో అలంకరింపబడ్డాయని చెప్పబడింది. పేయాళ్వార్లు కూడా మూన్ఱామ్ తిరువన్వాదిలోని 90వ పాశురంలో **"శిలమ్బుమ్ శెఱి కళలుమ్"** అంటూ ఈ రీతిలోనే కీర్తించారు. పెరియవాచ్చాన్‌పిళ్ళై తమ వ్యాఖ్యలో ఈ పేయాళ్వార్ల సూక్తిని ప్రమాణంగా ఉట్టంకించడాన్ని గమనించవచ్చు.

4. పెరియాళ్వార్లు, తొణ్డరడిప్పొడి ఆళ్వార్లు, కులశేఖరాళ్వార్లు - నమ్మాళ్వార్లు ప్రకృత ప్రబంధంలోని 34వ పాశురంలో భగవానుని క్షీరాబ్ధిశయన సన్నివేశానుభవాన్ని గూర్చి పల్కుతూ **"పాలాழி నీ కిడక్కుమ్ పణ్బుమ్ యామ్ కేట్టేయుమ్ కాలాழియుమ్ నెఞ్జాழియుమ్ కణ్ శుழలుమ్"** అని అన్నారు. ఇటువంటి అనుభవాన్నే తిరుమాలై ప్రబంధంలో తొండరడిప్పొడి ఆళ్వార్లు -**"అరవణై త్తుయిలు మాకణ్డు ఉడలెనక్కురుకు మాలో"** (19) అని, **"కణ్ణినై క్కణ్ణ కణ్‌గళ్ పనియరుమ్బుదిరుమాలో"** (18) అని అంటూ ప్రకటించారు. శ్రీకృష్ణభగవానుని వేణుగానానుభవాన్నిగూర్చి పెరియాళ్వార్లు తెలుపుతూ- **"కాలు మెழా కణ్ణనీరుమ్ నిల్లా ఉల్ శోర్న్దు నడుఙ్గి కురల్ మేలు మెழా మయిర్‌కూచ్చు మఱా ఎనతోళ్‌కళుమ్ వీழ్‌వొழియా మాలుకళానిఱ్ఱుమ్"** (5-3-5) అని అన్నారు. కులశేఖరాళ్వార్లు తమ ప్రబంధంలోని మొదటి దశకంలో **"తూరాద మనక్కాదల్ తొణ్డర్ తఙ్గళ్.... ఆరాద మనక్కళిప్పోడు అழుత కణ్ణీర్ మழై శోర నినైన్దురుకి ఏత్తి"** అని అన్నారు. ఈ ఆళ్వార్ల అనుభవాలలోని సామ్యం స్పష్టంకదా! ఇదేవిధంగా **"మాలార్ కుడి పుకున్దార్ ఎన్ మనత్తే"** (22) అనే ఆళ్వార్ల సూక్తికి, **"ఆరవత్త మళియినోడుమ్"** ఇత్యాది పెరియాళ్వార్ల సూక్తికి మధ్య గల భావసామ్యాన్ని గమనించవచ్చు.

5) పూదత్తాళ్వార్లు :- **"ఎన్నిల్ మికు పుకళ్వార్ యావరే" (4)** అని అంటూ ఆళ్వార్లు తమ కీర్యతిశయాన్నిగూర్చి పలికారు. దీనిని పెరియవాచ్చాన్‌పిళ్ళై- **"ఆశ్రయత్తిల్ విళ్ళిన పుకళ్ళైయుడైయార్ ఎవర్? ఎన్నపుమామ్"** (ఆశ్రయానికి మించిన కీర్తిని కల్గినవారెవరు? అనికూడా చెప్పవచ్చు) అని వివరించారు. ఇటువంటి భావాన్నే పూదత్తాళ్వార్లు ఇరణ్డామ్ తిరువన్దాదిలో **"ఎట్టళవన్దాల్ యానుడైయ అన్బు" (100)** అనే సూక్తిలో వ్యక్తం చేయడాన్ని చూడవచ్చు.

6) తిరుమళిశై ఆళ్వార్లు :- ఆళ్వార్లు 18వ పాశురంలో **"శోమ్బాతు ఇప్పల్లురువై యెల్లామ్ పడర్‌విత్త విత్తా"** అని అంటూ భగవానుని జీవసస్యకర్షకునిగా పలికారు. తిరుమళిశై ఆళ్వార్లు నాన్ముకన్ తిరువన్దాదిలో **"పత్తి యుళ్ళవన్"** అని అంటూ భక్తికర్షకునిగా స్తుతించారు. ఈ రెండు సూక్తులలో గల కర్షకత్వేన రూపణంలో సామ్యం స్పష్టం.

7) తిరుమజ్జై ఆళ్వార్లు :- నమ్మాళ్వార్లు 57వ పాశురంలో **"శుళిత్తెజుగ్గుమ్ తాళ్‌విడజ్గళ్ పన్నిరి ప్పులాల్ వెళ్ళమ్ తానుకళ"** అని అంటూ హిరణ్యకశిపుని నరసింహమూర్తి సంహరించినపుడు ఆ అసురుని వక్షఃస్థలంనుండి ప్రవహించిన రక్త ప్రవాహం సుడులు తిరుగుతూ పల్లపు ప్రాంతాలలో అంతటా వ్యాపించింది - అని అన్నారు. ఈ సూక్తిని వ్యాఖ్యానిస్తూ పెరియవాచ్చాన్‌పిళ్ళై **"హిరణ్యనై ప్పర్శిత్తు ప్పళ్ళ మెల్లామ్ రుధిరవెళ్ళమ్ శుళిక్కుమ్బడి "పెరు నీరిల్ ముమ్మై పెరిత" ఎన్నుమ్బడి రుధిరమ్ వెళ్ళమిడ"** అని తిరుమజ్జైయాళ్వార్ల. శ్రీసూక్తిని ప్రమాణంగా ఉట్టంకించారు. తిరుమజ్జైయాళ్వార్లు **"వళై యుకిరాళి మెయ్‌మ్బిన్ మఱవోన తాకమ్ మతియాతు శెన్రొరుకిరాల్ పిళవెళ విట్ట కుట్టమతు వైయ మూడు పెరునీరిన్ ముమ్మైపెరితే" (11-4-4)** (నృసింహస్వామి వంగిన తన నఖాలతో బలాన్ని కల్గి, ద్వేషాన్ని కల్గిన హిరణ్య కశిపుని శరీరాన్ని లెక్కించకుండా నఖాలతో రెండు భాగాలుగా చీల్చినపుడు వెలువడిన రక్తప్రవాహం ఈ లోకంలో అంతా వ్యాపించి ప్రళయజలప్రవాహంకంటే మూడు రెట్లు పెద్దదై ప్రవహించింది) అని ఈ ప్రమాణంయొక్క భావం. దీనినిబట్టి ఈ సూక్తులోని అర్థసామ్యం సుగమం. ఈ విధంగా ఇంకా ఈ ప్రబంధంలో కన్పడే పలు ఆళ్వార్ల సూక్తులతో గల అర్థసామ్యాలు సహృదయ మనోభావ్యాలు.

పెరియతిరువన్దాది ఒక అద్భుత కమనీయకావ్యం :- ఈ ప్రబంధంలోని పలు పాశురాలు ఉత్తమకావ్యానికి ఉదాహరణలు. ఆకాశంలో ప్రకాశించే నక్షత్రాలను

భగవానుని శ్రీచరణాలపై జల్లిన పూలుగా వర్ణించే **"ఇత్తై ముత్తైయాన్"** అనే (61) పాశురం, త్రివిక్రమావతార సందర్భాన్ని అందంగా వర్ణించే **'మీనెన్నుమ్" (62)** అనే పాశురం, భగవానుడు పాలసముద్రంలో శయనించి ఉండే సన్నివేశాన్ని కమనీయంగా వర్ణించే **"పిన్ తురక్కుమ్" (63)** అనే పాశురం కొన్ని ఉదాహరణలు. ఇంతేకాక, ఈ ప్రబంధం లోని పలు పాశురాల భావాలను పూర్వాచార్యులు తమ స్తోత్రాలలో అనుసంధించారు. **"శీరాల్ పిఱన్దు"** అనే పాశురాన్ని కూరేశులు అతిమానుషస్తవంలోని **"త్వన్నిర్మితా జఠరగా చ"** అనే శ్లోకంలో **"పుకళ్మోమ్ పళిప్పోమ్" (2)** అనే పాశురాన్ని భట్టర్ శ్రీరంగరాజస్తవంలోని **"అమతం మతమ్"** అనే శ్లోకంలో, **"ముదలామ్ తిరువురువుమ్ మూన్రెళ్బర్"** అనే పాశురభావాన్ని భట్టర్ **"త్రయో దేవా స్తుల్యాः"** అనే శ్లోకంలో అనుసంధించారు. ఇటువంటి ఉదాహరణలు ఇంకా చాలా ఉన్నాయి.

పెరియతిరువన్దాదిలోని ప్రాసాలంకారప్రయోగ సౌందర్యంకూడా అనుభావ్యం. 53వ పాశురంలోని **"నిన్‌పుకళ్‌ిల్ వైకున్దమ్ శిన్రైయిలుమ్ మన్నిరినితో? నీయవర్‌క్కు వైకున్ద మెన్రరుళుమ్ వాన్"** అనే ప్రయోగంలో **"వైకున్దమ్"** అనే పదం రెండు మార్లు ప్రయోగింపబడింది. వీటిలో మొదటి పదాన్ని **"వైకుమ్ తమ్"** అని, రెండవ పదం **"వైకున్దమ్"** అని గ్రహించి అర్థం చెప్పబడ్డాయి. "నీ కీర్తిలో స్థిరంగా నిలచి ఉండే మనస్సు కంటే మధురమైనదా నీవు గొప్పగా చెప్పి అనుగ్రహించే పరమపదం?'' అనే అర్థాన్ని ఈ ప్రయోగానికి పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించారు. ఇదే విధంగా 82వ పాశురంలోని **"కరన్దురు విన్ అమ్మానై యశ్శాస్టు ప్పిన్ తొడర్న్ద ఆళియుళ్ళై అమ్మానై యేత్తాతయర్‌త్తు"** అనే శబ్దసందర్భంలో **"అమ్మానై"** అనే పదం రెండు సార్లు ప్రయోగింప బడింది. **"కరన్దురువిన్ అమ్మానై"-** అన్నపుడు సహజరాక్షస రూపాన్ని మఱుగుపరచు కొని వర్తించే మాయామృగాన్ని- అని అర్థం. ఇక్కడ **"ఆ+మాన్"** అంటే ఆ లేడి అని అర్థం. రెండవ పదంలోని **"అమ్మానై"** అంటే - సర్వేశ్వరుడైన శ్రీరాముడని అర్థం. ఇక్కడ **"అమ్మాన్"** అని ఒకే పదంగా గ్రహించాలి. ఇటువంటి ప్రయోగాలను తిరుమజ్జై ఆళ్వార్ల ప్రబంధాలలోకూడా గమనించవచ్చు. **"మాలినన్తుళాయ్"** అనే పదం పెరియ తిరుమొళి. 11-1-8 వ పాశురంలో రెండుసార్లు ప్రయోగింపబడింది. ఇది **"మాల్ ఇనమ్ తుళాయ్"** అని, **"మాలిన్ అమ్ తుళాయ్"** అని రెండు విధాలుగా విభజింపబడి, నా మనస్సు నాకు అతని విషయంలో ఉండే వ్యామోహానికి అనురూపంగా తుళావి- అని, సర్వేశ్వరుని తిరుమేని స్పర్శను కల తులసీమాల అని రెండు విధాలుగా అర్థం చెప్పబడింది. ఇదేవిధంగా పెరియ తిరుమొళిలోని **"అవ్వాయన్ నిఱ్ఱ ఇవ్వాయన్"**

(11-2-2) అనే ప్రయోగంకూడా ఇటువంటిదే. **"ఆ+వాయన్"** (అవ్వాయన్) - పూతన స్తన్యాన్ని గ్రహించిన ఆ నోటిని కలవాడు. పూతన స్తన్యక్షీరంతోపాటు, ఆమె ఉసురును పీల్చిన నోటిని కలవాడని ఒక అర్థం, **"ఈ + ఆయన్- (ఇవ్వాయన్)-** ఈ గోపాలకుడు అని ఇంకొక అర్థం. (ఇక్కడ ఈ పదం బలరాముని నిర్దేశిస్తుంది.) 31వ పాశురంలోని మూడవ, నాల్గవ పాదాలలో గల **"కుడఙ్గడలై", "తడఙ్కడలై"** అనే పదాలలోను యమకం గమనార్హం. 5వ పాశురంలోని **"మాయ మా మాయవళై మాయ"** అనే ప్రయోగంలో గల ప్రాస, 2వ పాశురంలోని **"ఎఙ్గళ్‌మాల్ - శెఙ్గణ్‌మాల్"** అనే ప్రాస కూడా గమనించ దగినవి. ఇంకా ఇటువంటి శబ్దాలంకారచమత్కారాలు ఈ ప్రబంధంలో సహృదయ హృదయాను భావ్యాలు.

నమ్మాళ్వార్లు పెరియ తిరువన్దాది 26వ పాశురంలో **"ఎమ్మిఱైయార్ తన్ద అరుళెన్నుమ్ తణ్డాల్ అడిత్తు"** అని అంటూ భగవత్కృపను గదగా రూపిస్తూ పలికారు. శ్రీవిష్ణుపురాణంలోని అస్త్రభూషణాధ్యాయం **"బుద్ధి రధ్యాస్తే గదారూపేణ శార్ఙ్గిణః"** అని తెలిపింది. బౌద్ధికమైన దయను ఆళ్వార్లు గదగా పల్కడం సమంజసంకదా! తిరుమఙ్గైయాళ్వార్లు **"అరుళెన్నుమ్ ఒళ్ వాళురువి"** అని (6-2-4) భగవానుని దయను ఖడ్గంతో పోల్చారు ఈ ప్రయోగం. **"జ్ఞానాసినా"** అనే గీతా ప్రయోగానుగుణం. ఇటువంటి ప్రయోగమే ఇరామానుశ నూఱ్ఱన్దాదిలో కూడా (93) **"అరుళెన్నుమ్ ఒళ్ వాళురువి వెట్టి క్కళైన్ద"** అని కన్పిస్తుంది.

వేదం **"ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిధిధ్యాసితవ్యః"** అని అంటూ పల్కింది. భగవానుని స్వరూపాదులను పెద్దలవలన విని, వానిని మాటిమాటికి మనస్సులో సంభావించినపుడు, వాటిని మనసులో స్థిరంగా నిలుపుకొన్నప్పుడు వానిని ప్రత్యక్షంగా దర్శించాలనే గాఢమైన ఆశ, ఆర్తి కలుగుతాయి. ఇది పరభక్తి దశ. ఆవిధంగా ఆశించిన భగవత్స్వరూపాదులను మరింతగా భావించినపుడు ప్రత్యక్షసమానాకార రూపజ్ఞానం కల్గుతుంది. ఇది పరజ్ఞాన దశ. ఈ విధంగా కల్గిన అనుభవం పునఃపునః కలగాలనే గొప్ప అభినివేశం కల్గడం, విశ్లేషిస్తే సహించలేకపోవడం పరమభక్తి దశ. ఆళ్వార్ల దశ పరమభక్తిదశ.

28వ పాశురంలో ఆళ్వార్లు **"అన్ఱే నఙ్గణ్ కాణుమ్ ఆళియాన్... ఎన్ఱేనుమ్ కట్కణ్ణాల్ కాణాత అవ్వురువై నెఞ్చైన్ను ముట్కుణ్ణేల్ కాణు ముణర్న్దు"** అని అంటూ అంతరనేత్రం దర్శించగల్గినపుడే భగవానుని బాహ్యచక్షువుకూడా దర్శించగల్గుతుందని

అన్నారు. ఈ పాశురాన్ని వ్యాఖ్యానిస్తూ పెరియ వాచ్చాన్‌పిళ్ళై తమ వ్యాఖ్యలో- **"పరమభక్తి పిఱన్దు అవ్వస్తువై యొళ్ళియ చ్చెల్లామై యాతొరు పిఱక్కుమ్ అప్పోతు కాణుమ్ నమ్ కణ్ అవ్వస్తువై యొళ్ళియ చ్చెల్లు, మిన్ను కాణప్పోకాతు ఎన్గిఱతు"** అని వివరించడాన్ని గమనించవచ్చు. వేదం కూడా **"న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్"** అని అంటూ భగవానుని రూపం బాహ్యనేత్రానికి గోచరం కాదు అని అన్నది. భగవద్రూపాన్ని ఆంతరనేత్రం సదా దర్శించే దశ పరమ భక్తిదశ. ఇదే ఆళ్వార్ల దశ. ఇటువంటి దశ తమకు కల్గింది; కనుకనే భగవానుడు తమకు సులభుడయ్యాడని 29వ పాశురంలోని **"ఎనక్కెళియన్ ఎమ్పెరుమాన్ ఇఙ్గు"** అని ఆళ్వార్లు అన్నారు. ఈ పాశురానికి పెరియవాచ్చాన్ పిళ్ళై అవతారికను అనుగ్రహిస్తూ- **"ఎల్లార్క్కు మివ్వవస్తై పిఱక్కై అరితు; ఎనక్కి వ్వవస్తై పిఱన్దతు"** అని పలికారు. ఇక్కడ **"ఇవ్వవస్తై"** అంటే పరమ భక్తిదశయే. ఇదేరీతిలో భక్తియోగానికి చెందిన, వేదంలో విధింపబడ్డ శ్రవణ, మననరూప జ్ఞానాలనుగూర్చికూడా ఆళ్వార్లు 75వ, 76వ పాశురాలలో తెలియజేశారనే విషయం- 76వ పాశురావతారికలోని **"శ్రవణానన్తరభావియాన మననత్తై చ్చొల్లుకిఱతు"** అనే సూక్తి తెలుపుతున్నది. ఇదేవిధంగా పెరియ తిరువన్దాది ప్రబంధంలో ఇంకా పలుచోట్ల భక్తియోగానికి సంబంధించిన పలు అంశాలను ఆళ్వార్లు ప్రస్తావించడాన్ని గమనించ వచ్చు. అయితే,ఈ భక్తియోగం సాధనకోటిలోనికి చేరినదికాదని, ప్రాప్త్యాంతర్గత మని తెలియాలి.

పెరియతిరువన్దాది ప్రబంధంలో గమనించదగిన ఇంకొక అంశం ఏమంటే - ఆళ్వార్లు నైచ్యానుసంధానాన్ని మాటిమాటికి చేస్తూ, భగవానుని దరికి చేరకుండా వెనకంజవేయడం. ఈ అంశాన్ని ఆళ్వార్లు ప్రకృతప్రబంధంలో ఆదినుండి అంతంవరకు అనుసంధించారు. ఇందులోని స్వారస్యం వ్యాఖ్యానంలో ఆయాసందర్భాలలో వివరింప బడింది. అందువల్ల విస్తరభీతిచేత ఎక్కువగా దీనినిగూర్చి ప్రస్తావించలేదు.

పెరియతిరువన్దాదిలోని ఇంకొక గమనార్హమైన అంశం - ఆళ్వార్లు మనస్సును ఉద్దేశించిచేసే హితోపదేశం. దీనినికూడా ఆదినుండి అంతవరకు గమనించవచ్చు. **"మున్దుఱ్ఱ నెఞ్చే! ఇదుఱ్ఱువా ఎమ్మొడు నీ కూడి"** అని అంటూ మొదటి పాశురంలో మనస్సుకు ఉపదేశాన్ని చేయడం ఆరంభించిన ఆళ్వార్లు చివరి పాశురంలోకూడా- **"ఎప్పోతు మీతే శాల్ ఎన్ నెఞ్చే!"** అని అంటూ కొనసాగించారు కదా! ఇంకా ఈ ప్రబంధంలో గల పలు పాశురాలలో (9, 12, 14, 15, 19, 23, 37, 38, 39, 40, 46,

57, 65, 66, 67, 74, 83, 84, 87) ఈ ఆత్మోపదేశాన్ని గమనించవచ్చు. పలు రహస్య రహస్యస్వరూపసాంప్రదాయికార్థాలను వెలువరించడమే ఈ ఆత్మోపదేశంలోని పరమార్థం.

ఈ ప్రబంధంలో అసకృత్ ప్రస్తావింపబడ్డ ఇంకొక విషయం భగవత్ప్రపన్నుని పాపనిబర్హణం. (22, 25, 26, 30, 31, 33, 43, 54, 57, 59, 69, 86 మొదలైన) పలు పాశురాలలో దీని ప్రస్తావన కన్పిస్తుంది. **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"** అని అంటూ పాపవిమోచనాన్నిగూర్చి ప్రముఖంగా తెలిపే చరమశ్లోకం యొక్క అర్థాన్ని అనుసంధిస్తున్న ఈ ప్రబంధంలో పాపనిబర్హణ ప్రస్తావం పలుమార్లు చేయబడడం యుక్తమేకదా! ఇంకా ఈ ప్రబంధంలోని పలు విశేషాలు విస్తరభయంచేత ప్రస్తావింపబడలేదు.

పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానం : నాలాయిరంలో గల 24 దివ్యప్రబంధాలకు పూర్తిగా వ్యాఖ్యానాన్ని అనుగ్రహించిన **వ్యాఖ్యాతృచక్రవర్తి, పరమకారుణికులు- పెరియవాచ్చాన్‌పిళ్ళై** ఈ ప్రబంధానికికూడా అద్భుతమైన, గంభీరమైన వ్యాఖ్యను కృపజేశారు. ఈ వ్యాఖ్యానం కొన్ని చోట్ల సంగ్రహంగాను, కొన్ని చోట్ల నాతివిస్తృతంగాను ఉన్నది. ఆవశ్యకమైన సందర్భాలలో గంభీరాలైన వేదాంతార్థాలను ప్రతిపాదిస్తూ వీరు తమ వ్యాఖ్యను అనుగ్రహించారు. ఉదాహరణకు ఒకటి రెండు పాశురాల వ్యాఖ్యలను గమనించవచ్చు. 42వ పాశురంలో నమ్మాళ్వార్లు **"పారుణ్డాన్ పారుమిళ్గ్‌న్దాన్ పారిడన్దాన్ పారళన్దాన్ పారిడముణ్ పడైత్తాన్ ఎన్బరాల్ పారిడమావానుమ్ తాన్"** అని అంటూ పరమాత్మ ఈ లోకాన్ని సృష్టించి, రక్షించి, లయం చేసినవాడు కనుక ఈలోకమై ఉన్నవాడు ఇతడే- అని సామానాధికరణ్యప్రయోగాన్ని చేశారు. ఈ ప్రయోగాన్ని పెరియవాచ్చాన్‌పిళ్ళై ఛాందోగ్యంలోని **"సర్వం ఖల్విదం బ్రహ్మ, తజ్జలానీతి శాంత ఉపాసీత"** అనే వాక్యంతో సమన్వయిస్తూ ఇక్కడి ఐక్యం రక్ష్యరక్షకభావప్రయుక్తం - అని అన్నారు. భగవద్భాష్యకారులు ఈ ఉదాహృత శ్రుతివాక్యాన్ని శ్రీరామానుజులు శ్రీభాష్యంలో, వేదార్థసంగ్రహంలో పలు చోట్ల ప్రమాణంగా ఉదాహరిస్తూ వివరించారు. శ్రీభాష్యంలోని జిజ్ఞాసాధికరణంలో (శ్రుతిఘట్టంలో) **"సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానీతి శాంత ఉపాసీతేతి తన్నానాత్వానుసంధానస్య శాంతిహేతుత్వోపదేశాత్, తథాహి. సర్వస్య జగతః తదుత్పత్తి స్థితిలయకర్మతయా తదాత్మకత్వానుసంధానేన అత్ర శాంతి ర్విధీయతే"** అని, వేదార్థసంగ్రహంలో "సర్వం ఖల్విదం బ్రహ్మ.... ఇత్యాది సామానాధి

కరణ్య ప్రయోగేషు సర్వైః శబ్దైః సర్వశరీరతయా సర్వప్రకారం బ్రహ్మైవాభిధీయత ఇతి చోక్తమ్" అని అంటూ శ్రుతివాక్యంలోని సామానాధికరణంద్వారా చెప్పబడ్డ ఐక్యం సూచించారు. ఈ విధమైన వివరణం పై నమ్మాళ్వార్ల శ్రీసూక్తివంటి దివ్యసూరి ప్రయోగాలను ఆధారంగా చేసికొని చేయబడింది. పెరియవాచ్చాన్‌పిళ్ళైవ్యాఖ్యలోని - **"రక్ష్యరక్షకభావాదిసంబంధఙ్గళాలే ఐక్యమ్, స్వరూపతః అన్ను, "సర్వం ఖల్విదం బ్రహ్మ"** ఎన్ఱ ప్రపంచత్తుక్కుమ్ బ్రహ్మత్తుక్కు మైక్యత్తై చ్చొల్లి, **"తజ్జలానీతి"** ఎన్ఱ హేతు శొన్నాల్పోలే." అనే వివరణం గమనించదగినది. **"తజ్జలానీతి"** అనే హేతువు **"తజ్జత్వాత్ తల్లత్వాత్, తదనత్వాత్"** అని వివరించబడడంద్వారా, పరబ్రహ్మనుండి పుట్టడంవల్ల భగవానునిలో లయించడంవల్ల భగవానునిచేత తదధీనసత్తాప్రవృత్తినిమిత్తకమైన రక్షణను పొందడంవల్ల జగత్తుకు పరబ్రహ్మకు మధ్య సామానాధికరణ్యంద్వారా ఐక్యం చెప్పబడింది. ఈ జగత్తు- పరమాత్మల మధ్య చెప్పబడ్డ సామానాధికరణ్యం కార్యకారణ భావనిబంధనమని, శరీరశరీరభావనిబంధనమని రెండువిధాలుగా శాస్త్రాలలో తెలుప బడింది. **"తజ్జత్వాత్ తల్లత్వాత్ - సర్వం ఖల్విదం బ్రహ్మ"** అన్నప్పుడు కార్యకారణభావ నిబంధనరూపసామానాధికరణ్యం, **"తదనత్వాత్ సర్వం ఖల్విదం బ్రహ్మ"** అన్నపుడు రక్ష్యరక్షకభావనిబంధన సామానాధికరణ్యం తెలుపబడ్డాయి. భగవానుడు చేసే రక్షణం లోకంలో కన్పించే చక్రవర్త్యాదులు చేసే రక్షణంవంటిదికాక **"అంతః ప్రవిశ్య శాస్తా జనానామ్ సర్వాత్మా"** అన్నట్లు అపృథక్ సిద్ధసంబంధ పూర్వకమైనది, శరీరశరీరిభావ నిబంధనపూర్వకమైనది. కనుక శ్రుతిలో తెలుపబడ్డ రక్ష్యరక్షకభావం శరీరశరీరి భావంలోకి పర్యవసిస్తుంది. ప్రణవంలోని అకారంద్వారా ఈ రక్ష్యకభావం సూచింపబడుతున్నది కదా. అందువల్ల ప్రకృతపాశురంలో తెలుపబడ్డ రక్ష్యకరక్షకభావప్రయుక్త సామానాధి కరణ్యం శరీరశరీరిభావ నిబంధనపూర్వక సామానాధికరణ్యంలోనే అంతర్భవిస్తుందని చెప్పాలి. అయితే, పెరియవాచ్చాన్ పిళ్ళై తమ వ్యాఖ్యలో **"రక్షకభావాదిసంబంధఙ్గళాలే"** అనిఅంటూ రక్ష్యరక్షకభావాన్ని ప్రధానంగా పేర్కొనడానికి కారణం ఏమంటే, ఆళ్వార్లు పాశురంలో **"పారుణ్డాన్ పారుమిళ్గ్‌న్దాన్ పారిడన్దాన్ పారళన్దాన్"** అని అంటూ భగవానుని జగద్రక్షణకార్యాలను ప్రస్తావించడంవల్ల, ఆ సూక్తిని అనుసరిస్తూ పేర్కొన్నారని చెప్పాలి. విశేషమేమంటే - శ్రుతివాక్యంలో ముందు **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** అని సామానాధికరణ్యం ప్రస్తావింపబడి, తరువాత **"తజ్జలానీతి"** అని హేతువు చెప్పబడగా, పాశురంలో ముందుగా **"పారుణ్డాన్ పారుమిళ్గ్‌న్దాన్...."** ఇత్యాదిగా హేతువు, తరువాత తత్ప్రయుక్తమైన **"పారిడమానానుమ్‌తాన్"** అనే సామానాధికరణ్యం పేర్కొనబడ్డాయి.

ఇదే విధంగా **"పారుమ్ నీ వానుమ్ నీ కాలుమ్ నీ తీయుమ్ నీ నీరుమ్ నీయాయ్ నిన్న నీ"** అనే ప్రయోగంలోని సామానాధి కరణ్యం శరీరశరీరిభావప్రయుక్తమనికూడా సూచిస్తూ- **"విభూతిసామాన్యజ్ఞళుక్కు నిర్వాహకనాయ్, అవ నీర్ చ్చొల్లుకిఱ శబ్దమ్ ఉన్నళవుమ్ వరుమ్బడి నిత్కిఱ ఉన్నక్కు."** అని వివరించారు. భగవానుడు కోరి ఆదరంతో సమీపించి నపుడు తన అయోగ్యతను చూచి వెనుకంజ వేసేవారు సీతాదేవిని శ్రీరాముని నుండి దూరం చేసినవారితో సమానులనే స్వారస్యాన్ని **"నాళాల్ అమర్ ముయన్ట వల్లరక్కన్ ఇన్నుయిరై వాళ్వా వకై వలితల్ నిన్ వలియే"** (11) అనే ప్రయోగంద్వారా ధ్వనిస్తున్నదని **"అయోగ్య నెన్ట అకలుమవర్కళ్ పిరాట్టియై ప్పిరిత్త రావణనోడొప్పర్కళ్"** అని అంటూ సూచించారు. సందర్భానుగుణంగా పదాలను వివరించడంలోని సొగసుకు ఉదాహరణంగా 7వ పాశురంలోని **"అయోగ్యరెన్ట పిళ్ళైక్కిక్కుమ్, మేల్ విళు కైక్కుమ్ హేతు"** ఇత్యాది వ్యాఖ్యానాన్ని గమనించవచ్చు. ఇటువంటి రస్యరహస్య విశేషాలు అడుగడుగునా పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యలో గోచరిస్తాయి.

సూమారు అయిదువందల సంవత్సరాలకాలం పాటు తాళపత్రాల రూపంలో రక్షింపబడ్డ నాలాయిర దివ్యప్రబంధవ్యాఖ్యానాలు సుమారు 100-120 సం॥లకు ముందు శ్రీవైష్ణవ గ్రంథముద్రాపక సభవంటి సంస్థల ప్రయత్నంతో, ఉదారులైన భక్తులు అందించిన ద్రవ్యసహాయంతో ముద్రింపబడ్డాయి. కాని, ఆ ప్రతులు ఇపుడు దుర్లభాలు. దొరికినా శిథిలాలు, కృమిదష్టాలు. అందువల్ల వాటిని పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఇపుడు ఎంతయినా ఉన్నది. కేవలం మణిప్రవాళవ్యాఖ్యను మాత్రమే కాక, తెలుగు వివరణంతో కలిపి ముద్రిస్తే ప్రబంధవ్యాఖ్యలలో మాధుర్యాన్ని సామాన్యపాఠకులు సైతం అనుభవించి ఆనందించే అవకాశం ఉంటుందని భావించి ప్రస్తుత ప్రయత్నం చేయబడింది. పెరియ తిరువన్దాదికి **'భావదీపిక'** అనేపేరుతో ముద్రింపబడే ఆంధ్రవివరణం **ఉ.వే. శ్రీమాన్ ఎస్.కృష్ణస్వామి అయ్యంగార్** ముద్రించిన ద్రావిడ వివరణాన్ని కృతజ్ఞతాపురస్సరంగా అనుసరించి వ్రాయబడింది. ఇందులోని గుణదోషాలకు సహృదయవిబుధులు ప్రమాణం.

ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ ఉభయవేదాంతవిద్వాంసులుగా కీర్తి గడించిన విజయ నగరం వాస్తవ్యులు **ఉ.వే. శ్రీమాన్ కందాళ వేంకటాచార్యస్వామివారి** తిరునక్షత్రోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీఏడు ఆషాడ మాసంలో ఉభయవేదాంత పండితసభలు అద్వితీయవైభవంతో నిర్వహింపబడుతున్న విషయం ప్రపన్నలోకానికి సుపరిచితం.

ఈ సభల నిర్వహణలో **విజయనగరం త్రైవర్ణిక వైష్ణవ రామానుజకూటంగోష్ఠివారు** అందించే సహాయసహకారాలు కాని; వారికి శ్రీమాన్ వేంకటాచార్యస్వామివారిపై, వారి కుటుంబ సభ్యులపై ఉండే భక్తి ప్రపత్తులు కాని ఆశ్చర్యాన్ని కల్గించకమానవు. **శ్రీమతి కె.వి. జానకమ్మగారి** సభానిర్వహణవిధానం ప్రశంసనీయం. ఈసభలలో ప్రతిసంవత్సరం ఒక సద్గ్రంథం ముద్రింపబడడం, ఆ గ్రంథముద్రణ పవిత్ర కైంకర్యాన్ని శ్రీమాన్ వేంకటాచార్యస్వామివారి శిష్యులలో ఒక్కొక్కరు ఒక్కొక్క ఏడు చేసికోవడంకూడా అభినందనీయం. ఈ సంవత్సరం ఆషాడమాసంలో (జూలైనెలలో) జరుగబోయే పండితసభలలో నమ్మాళ్వార్ల ప్రబంధాలు నాల్గింటిలో మూడవది అయిన పెరియ తిరువన్దాది పెరియవాచ్చాన్‌పిళ్ళైవ్యాఖ్యతో, పూర్వుల అరుంబదవివరణంతో, భావదీపికా ఆంధ్ర వ్యాఖ్యానంతో ముద్రింపబడు తున్నది. ఈ గ్రంథముద్రణ కైంకర్యాన్ని **శ్రీమతి దాచేపల్లి సుబ్బలక్ష్మి, శ్రీమాన్ దాచేపల్లి జోగి జగన్నాథం దంపతులు** చేసికోగల్గడంవారి భాగ్యవిశేషాన్ని, ఆచార్యభక్తిని సూచిస్తున్నది. ఆ దంపతులకు ఇద్దరికి నేను మనసార మంగళాశాసనాలను చేస్తూ, వారి కుటుంబానికి ఉత్తరోత్తరాభివృద్ధి అన్ని విధాలుగా కలగాలని కోరుకొంటూ, ఆ విధంగా వారిని అనుగ్రహించవలసినదిగా అస్మదారాధ్యదైవం **శ్రీనివాసప్రభువును** వేడుకొంటున్నాను. **శ్రీమాన్ జోగి జగన్నాథం, శ్రీమతి సుబ్బలక్ష్మి** దంపతులను ఈ కైంకర్యాన్ని చేయమని ప్రోత్సహించిన, ఈ గ్రంథానికి ఆంధ్రవివరణం వ్రాయవలసినదిగా నన్ను కోరిన **శ్రీమతి కె. వి. జానకమ్మగారికి** ధన్యవాదాలను సమర్పించుకుంటున్నాను. దానుని వివరణాన్ని సాంతం పరిశీలించి మంగళాశాసన పురస్సరమైన అభిప్రాయాలను అనుగ్రహించిన **సువచః శ్రీవల్లభ, పండితరత్న, వాచస్పతి, ఉ.వే. శ్రీమాన్. డా. టి.పి. శ్రీరామచంద్రాచార్యస్వామివారికి, పండితరత్న, ఉభయవేదాంతవాచస్పతి, ఉ.వే. శ్రీమాన్ కిడాంబి వేంకటాచార్యస్వామివారికి, పండితరత్న, శాస్త్రరత్నాకర, ఉ.వే. శ్రీమాన్. డా. ఎస్.వి. రంగరామానుజాచార్యస్వామివారికి** కార్తజ్ఞ్య పురస్సర నమస్సుమనస్సులను సమర్పించుకొంటున్నాను. నా ఈ అనువాద ప్రయత్నంలో అన్నివిధాల ప్రోత్సహించి, తగు సూచనలతో మార్గదర్శనం చేసిన పితృపాదులు **న్యాయవేదాంత విద్వాన్, ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగరామానుజచార్య స్వామివారి** సన్నిధిలో భక్తి ప్రపత్తులతో ప్రణమిల్లుతున్నాను. సకాలంలో గ్రంథాన్ని డి.టి.పి చేసి సహకరించిన శ్రీమతి **జయలక్ష్మి, శ్రీచంద్రశేఖర్‌గార్లకు,** అందంగా ముద్రించిన **పి.ఎన్. ప్రింటర్స్, శ్రీహర్షవర్ధన్‌గారికి** కృతజ్ఞతలు. పెరియ తిరువన్దాది ప్రబంధంలోని పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యలలోని మాధుర్యాన్ని చవిచూచి, ఈ గ్రంథాన్ని

సద్వినియోగం చేసికోవలసినదిగా సహృదయులైన ఆస్తిక పాఠకులను వేడుతున్నాను,
స్వస్తి.

1. బృహదంతాది శృఙ్గజిన్మునిదృష్టోఽథర్వవేదసారోఽయమ్ ।
శ్రీకృష్ణసూరిగురుణా వివృతో మధురం గభీరయా వాచా ॥

2. వ్యాఖ్యాతృచక్రవర్తివ్యాఖ్యా మనుసృత్య శింగరాచార్యః ।
ఆంధ్ర్యాం వ్యలిఖద్వివృతిం భక్త్యేమాం భావదీపికానామ్నీమ్ ॥

3. క్వ శఠారిగిరాం తత్వం క్వ కృష్ణసూరిగురుసూక్తిగాంభీర్యమ్ ।
క్వ మితంపచస్య యత్నో మే, పరిహాస్యో విబుధవరై ర్మానమ్ ॥

4. కింతు సంగాత్ స్వలాభ స్స్యాదితి భట్టార్యభాషితమ్ ।
స్మృత్వేదం సాహసం కుర్వే సోఢవ్యం క్షమిణాం వరైః ॥

5. స్ఖలనాని బహూన్యత్ర ప్రమాదాన్మేఽజ్ఞానతోఽపి వా ।
గుణాస్తు కృపయాఽఽర్యాణా మితి సద్భి ర్విగణ్యతామ్ ॥

6. జయతు శఠకోపసూక్తిః జయతుతరాం కృష్ణసూరివాగమృతమ్ ।
జయతుతమాం విబుధాళిః సదా తదాస్వాదనాసక్తా ॥

7. వాధూలవేంకటార్యాణాం జన్మతారామహే శుభే ।
ప్రచాలితే వికృత్యబ్దే జ్ఞాపికేయం ప్రకాశ్యతే ॥

8. సుబ్బలక్ష్మీజగన్నాథౌ కృతినౌ జంపతీ ధ్రువమ్ ।
యాభ్యాం కృతిః శఠారాతేః సవ్యాఖ్యేయం సమర్ప్యతే ॥

ఇట్లు

తిరుపతి. బుధజనవిధేయుడు

14-6-2010 ఈ.ఏ. శింగరాచార్యులు.